అదనపు కమిషనర్ బాధ్యతల స్వీకరణ

సువార్త

కార్పొరేషన్, ఆగస్టు 5: కరీంనగర్ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా సువార్త సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్‌లో పని చేసిన ఆమె కరీంనగర్ నగరపాలక సంస్థకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఎస్టాబ్లిష్ మెంట్, బర్త్, డెత్, అకౌంట్స్, మెప్మా సెక్షన్ల అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. సెక్షన్ల వారీగా విధుల పరంగా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని, ప్రతి ఉద్యోగి సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఆర్వోలు ఆంజనేయులు, గణేశ్ రెడ్డి, డీఈ ఓం ప్రకాశ్, టీపీబీవో వేణు, ఏఈలు, టీపీఎస్‌లు, ఆర్ఐలు, సూపరింటెండెంట్లు, సెక్షన్ క్లర్కులు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెప్మా సీవోలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్‌పై అవగాహన సదస్సు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 5: ఇన్‌స్పైర్ మనాక్ అవార్డు 2024-25 నామినేషన్లపై అవగాహన కోసం ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని ఫిలిం భవన్‌లో జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్వాలిటీ కంట్రోల్ కోఆర్డినేటర్ కర్ర అశోక్ రెడ్డి మాట్లాడుతూ, ఇన్‌స్పైర్ మనాక్ 2024-25 నామినేషన్ల ప్రక్రియ సెప్టెంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గతేడాది వివిధ సైన్స్ కాంపిటీషన్స్‌లో సాధించిన విజయాలను సమీక్షిస్తూ ఈ విద్యా సంవత్సరానికి మరింత ఉత్సాహంగా అన్ని సైన్స్ కార్యక్రమాల్లో పాల్గొని జిల్లా రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా పని చేయాలని సూచించారు. టీఎస్ఐసీ ఆపరేషన్స్ మేనేజర్ శ్రవణ్ కుమార్ మెంటార్ ఐడియా ఇన్నోవేషన్ గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ సెక్టోరల్ కోఆర్డినేటర్ కే అశోక్ రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ స్వదేశ్ కుమార్, ఓపెన్ స్కూల్ సెక్రటరీ నాగేశ్వరరావు, టీబీఎస్ఎఫ్ అధ్యక్షుడు ఆర్ గంగారం, రిసోర్స్ పర్సన్, వీ ఆంజనేయులు, డాక్టర్ వేణుగోపాల్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాటం ద్వారానే కూలి రేట్లు పెరుగుతాయి

చామనపల్లిలో పవర్ లూమ్ కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల రమేశ్ తదితరులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 5: కార్మికుల పోరాటం ద్వారానే కూలి రేట్లు పెరుగుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల రమేశ్ పేర్కొన్నారు. కరీంనగర్ మండలం చామనపల్లిలో చామనపల్లి, చెర్లభూత్కూర్, ఫకీర్‌పేట, ఎలబోతారం, జూబ్లీనగర్ గ్రామాల పవర్‌లూమ్ కార్మికులు చేపట్టిన సమ్మె 22వ రోజుకు చేరుకోగా, సోమవారం సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. పోరాటం ద్వారానే గతంలో ఎనిమిది సార్లు వేతన ఒప్పందం జరిగిందని, అదే స్ఫూర్తితో ఈ సమ్మెను కూలి రేట్లు పెరిగే వరకు విజయవంతంగా నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్, పవర్ లూమ్ కార్మిక సంఘం అధ్యక్షుడు దూడం గంగాధర్, నాయకులు రాజు, మల్లేశం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

రాజుకు ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ తిరుమల్

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 5: పట్టణానికి చెందిన అనుపు రాజు అనే యువకుడు తన ఫోన్ అయ్యప్ప స్వామి ఆలయం దగ్గర పోయిందని సోమవారం టౌన్ సీఐ తిరుమల్‌కు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన సీఐ, ఫోన్ వివరాలు సేకరించి క్రైమ్ పార్టీ సహాయంతో దానిని వెతికి అనుపు రాజుకు అప్పగించారు. పోయిన కొద్దిసేపటికే ఫోన్‌ను గుర్తించి అప్పగించిన పోలీసుల సేవలను అనుపు రాజు కొనియాడాడు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'లో భాగస్వాములవ్వాలి


అన్నారంలో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, ఇతర అధికారులు

- పాఠశాలల్లో కిచెన్, హెర్బల్ గార్డెన్‌లకు ప్రాధాన్యతనివ్వాలి
- అన్నారంలో ప్రత్యేక కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్ రూరల్, ఆగస్టు 5: పారిశుధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అందరూ భాగస్వాములయ్యేలా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. సోమవారం మానకొండూర్ మండలం అన్నారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. 'స్వచ్ఛదనం- పచ్చదనం'లో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి అధికారులు, సిబ్బందితో పాటు మహిళా సంఘాల సభ్యులకు సూచనలు చేశారు. ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్తతో కంపోస్టు ఎరువును తయారు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అలాగే ప్లాస్టిక్ కవర్లకు బదులు సంచులు, డబ్బాలను వినియోగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టి అందరినీ భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో హెర్బల్, కిచెన్ గార్డెన్ల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ విజయవంతం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ముగ్గులు, వ్యాస రచన పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గల పశు సంవర్ధక శాఖ కార్యాలయాన్ని సైతం పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్డీవో శ్రీధర్, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో కిరణ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అలేఖ్య, వివిధ శాఖల అధికారులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊరూరా.. ఉత్సాహంగా

హుజూరాబాద్ రూరల్/జమ్మికుంట/సైదాపూర్/ఇల్లందకుంట/ చొప్పదండి/ గంగాధర/ రామడుగు/ కొత్తపల్లి/ మానకొండూర్/ కరీంనగర్ రూరల్/ వీణవంక/ చిగురుమామిడి/శంకరపట్నం, ఆగస్టు 5: జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆర్డీవో రమేశ్ మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, అధికారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఎంపీడీవో సునీత, ఎంపీవో సతీశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. జమ్మికుంట మండలం మడిపల్లిలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి తహసీల్దార్ రమేశ్‌బాబు హాజరుకాగా, జమ్మికుంట పట్టణంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ ఎండీ ఆయాజ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు. సైదాపూర్ మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఇల్లందకుంట మండలంలోని వివిధ గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద స్వచ్ఛదనం-పచ్చదనంపై నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి అధికారులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, తహసీల్దార్ రాణి, ఎంపీవో రాజేశ్వర్ రావు, ఇన్‌చార్జి ఏపీవో రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. చొప్పదండి పట్టణంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ ప్రారంభించారు. వైస్ చైర్ పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి-సాంబయ్య, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఎస్ఐ అనూష, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. గంగాధర మండల కేంద్రంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, ఎంపీవో జనార్దన్ రెడ్డి పాల్గొని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గర్శకుర్తిలో నాయబ్ తహసీల్దార్ వినయ్, ఆచంపల్లిలో ఏఎస్‌వో చిన్నయ్య పాల్గొన్నారు. రామడుగు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కొక్కెరకుంట విండో చైర్మన్ వొంటెల మురళీకృష్ణారెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఏవో యాస్మిన్, ఎంపీవో శ్రవణ్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న తదితరులు పాల్గొన్నారు. కొత్తపల్లిలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు కార్యక్రమాన్ని ప్రారంభించగా, మున్సిపల్ కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. మల్కాపూర్ గ్రామంలో జరిగిన అవగాహన ర్యాలీకి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపీడీవో ప్రభు, హెచ్ఎం సదేశ్ కుమార్, ఏపీవో స్రవంతి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మానకొండూర్ గ్రామపంచాయతీ ఆవరణలో అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు కలిసి రంగోళి నిర్వహించారు. కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని నూతన పంచాయతీ కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మండల ప్రత్యేకాధికారి, ఆర్డీవో కె. మహేశ్వర్ హాజరై స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బొమ్మకల్‌లో ప్లాస్టిక్ నిర్మూలన కోసం బట్ట సంచులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. వీణవంక మండల కేంద్రంలో మండల ప్రత్యేకాధికారి డి.కొమురయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛదనం-పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో సురేందర్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, హెచ్ఎం పులి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ పి. శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఖాజా మొయినుద్దీన్, ఎంపీవో బండ రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. శంకరపట్నం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పాఠశాల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. రోడ్లు ఊడ్చి శుభ్రం చేశారు. మండల ప్రత్యేకాధికారి నాగార్జున కేశవపట్నం గ్రామ పంచాయతీలో మొదటి రోజు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో, గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

గంగాధర, ఆగస్టు 5: మండల తహసీల్దార్‌గా అనుపమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన రమేశ్‌బాబు జమ్మికుంటకు బదిలీ కాగా, కేశవపట్నం తహసీల్దార్‌గా పని చేసిన అనుపమ గంగాధరకు బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌ను మాజీ సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ మాజీ సర్పంచులు మేచినేని నవీన్‌రావు, వేముల దామోదర్, రామిడి సురేందర్, వేముల అంజి, తోట మల్లారెడ్డి, ముక్కెర మల్లేశం, అలువాల తిరుపతి, కొంకటి శంకర్, వడ్లూరి ఆదిమల్లుతోపాటు మాజీ ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, నాయకుడు అఖిల్ తదితరులు ఉన్నారు.

మండల స్థాయి పోటీలకు స్పందన

మానకొండూర్, ఆగస్టు 5: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 'తెలంగాణలో చేనేత వస్త్రాలు- వాటి ప్రాముఖ్యత పాత్ర(డిజైన్, ఉత్పత్తులు, ఉద్యోగ కల్పన)' అంశంపై మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవన్‌లో మండలస్థాయి వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 8,9 తరగతి చదివే విద్యార్థులు ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరు పాల్గొన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విజేతలకు మండల విద్యాధికారి ఎం మధుసూదనాచారి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

యూనివర్సిటీ పేరు మార్చుతామనడం శోచనీయం

తెలంగాణ, ఆగస్టు 5: సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చుతానమడం శోచనీయమని కరీంనగర్ వైశ్య సేవా కేంద్రం సంఘం అధ్యక్షుడు సురేశ్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్ భవనంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మద్రాసు రాష్ట్రం నుంచి తెలుగు రాష్ట్ర విభజన కోసం దీక్ష భూని ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన పేరు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి తొలగిస్తే, హైదరాబాద్‌లోని ప్రముఖ పార్క్ స్థలాలు, నిర్మాణాలకు ఉన్న ఆంధ్రుల పేర్లను కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. వైశ్యులు మనోభావాలను కించపరుచకుండా తెలుగు విశ్వవిద్యాలయాన్ని త్యాగ శీలి పొట్టి శ్రీరాములు పేరున కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును సుప్రీం కోర్టు పునర్ సమీక్షించాలి

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును పునర్ సమీక్షించాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్సీవీవీపీఎస్ నాయకులు

కలెక్టరేట్, ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణ తీర్పును సుప్రీంకోర్టు పునర్ సమీక్షించాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన మాల, ఉపకులాలకు చెందిన యువకులు పోరాట సమితికి సంఘీభావం తెలుపుతూ, ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మేడి అంజయ్య, మహేశ్ మాట్లాడుతూ, వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ బద్ధంగా లేదని విమర్శించారు. 341, 342 అధికరణల ప్రకారం రాజ్యాంగంలో మార్పులు చేసే అధికారం రాష్ట్రాలకు లేదని స్పష్టం చేశారు. రాష్ట్రపతి ఆమోదం లేకుండానే రాజ్యాంగ మార్పులు చేయాలనుకోవడం అవివేకమన్నారు. వెంటనే రాష్ట్రపతి కలుగజేసుకుని సుప్రీం తీర్పును పునర్ సమీక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు కె.శంకర్, వి.ఎల్లయ్య, హన్మంతు, ఎలుక ఆంజనేయులు, గంట కళ్యాణిశ్రీనివాస్, జి.శ్రీనివాస్, కె.చంద్రయ్య, జి.కమలాకర్, ఎం.శ్యామ్, ఈ.వై.రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్ల వితరణ

రెయిన్ కోట్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, చిన్న ఎల్లారెడ్డి ట్రస్ట్ సభ్యులు

చొప్పదండి, ఆగస్టు 5: పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు చిన్న ఎల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో రైన్ కోట్లను సమకూర్చగా, వాటిని సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ పంపిణీ చేశారు. ట్రస్ట్ సేవాభావాన్ని అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు కొట్టే అశోక్ , మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్, నాయకులు ఇప్పనపల్లి సాంబయ్య, నలుమాచు రామకృష్ణ, పెరుమాండ్ల గంగయ్య, కొత్తూరి నరేశ్, దండే కృష్ణ, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పత్తి పంటపై గడ్డిమందు పిచికారీ చేసిన ఇద్దరిపై కేసు

ఇల్లందకుంట, ఆగస్టు 5: పత్తి పంటపై గడ్డిమందు పిచికారీ చేసిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వాగొడ్డురామన్నపల్లి గ్రామానికి చెందిన చింతం చంద్రమోహన్ అదే గ్రామానికి చెందిన తెప్ప కొమురయ్య వద్ద 2023లో 31 గుంటల భూమిని రూ.14లక్షలకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. మొదటి విడుతగా రూ. 6లక్షలు చెల్లించి పంటను సాగు చేసుకుంటున్నాడు. ఇటీవల మిగతా రూ.8లక్షలు తీసుకొని భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని చంద్రమోహన్ కోరగా కొమురయ్య నిరాకరించాడు. ఈ క్రమంలో సదరు భూమిలో తాను సాగు చేసిన పత్తి పంటపై కొమురయ్య అతడి కుమారుడు విజయ్‌పాల్‌తో కలిసి ఆదివారం రాత్రి గడ్డిమందును పిచికారీ చేశారని, దీంతో పంట ఎండిపోయిందని చంద్రమోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కొమురయ్య, విజయ్‌పాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొక్క నాటుతున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 5: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాల ఆవరణలో ఇందిర వన ప్రభ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మొక్కలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ

చిగురుమామిడి, ఆగస్టు 5: ఇందుర్తి గ్రామంలో రంగస్థల కళాకారుడు అనగోని పర్శయ్య గౌడ్ ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబానికి శ్రీ లక్ష్మీ గణపతి యూత్ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర వస్తువులతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ యూత్ సభ్యులు సంతోష్, కిరణ్, సంపత్, నవాబు, కుమార్, మహేశ్, శేఖర్, సతీశ్, నగేశ్, కిరణ్, అన్వేష్, శ్రీనివాస్, వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

పాపన్న జయంత్యుత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్, ఆగస్టు 5: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 374వ జయంతి జాతీయ వారోత్సవాల వాల్ పోస్టర్‌ను సోమవారం సైదాపూర్ క్రాస్ రోడ్డులోని ఆయన విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. ఈ నెల 11న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే జయంతి వారోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జైగౌడ ఉద్యమం జిల్లా అధ్యక్షుడు తిరుపతి గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మండలాధ్యక్షుడు కందాల రాజు గౌడ్, పట్టణాధ్యక్షుడు శ్రీపతి కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి

కలెక్టరేట్, ఆగస్టు 5: విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ డీఆర్‌వోకు వినతి పత్రం అందజేశారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌కు పాలకవర్గం ఏర్పాటు చేసి, తక్షణమే రూ.1000 కోట్లు మంజూరు చేయాలని, తదితర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ శ్రీరామోజు రవీంద్రాచారి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు గుండోజు లక్ష్మయ్య, శేకల్ల హరిచారి, రాష్ట్ర కార్యదర్శి ఊకంటి ఓంకార్, గంగిపల్లి ఎంపీటీసీ రంగు భాస్కరాచార్యులు, నగర కన్వీనర్ తిప్పారపు శ్రీనివాస్, జిల్లా కో-కన్వీనర్స్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు, పాల ప్యాకెట్ల పంపిణీ

గంగాధర, ఆగస్టు 5: గర్శకుర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్శకుర్తి పల్లె దవాఖాన ఆవరణలో సోమవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు, పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. గంగాధర క్లబ్ అధ్యక్షుడు శ్రీరాం శ్రవణ్, గర్శకుర్తి క్లబ్ అధ్యక్షుడు మిట్టపెల్లి రాజశేఖర్, సభ్యులు శ్రీనివాస్, అనిల్, రమేశ్, రాజు, శంకరయ్య, సమ్మయ్య, బాపురెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, అనిల్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325783-All

WANTED

★ప్రముఖ కార్పొరేట్ కాలేజ్ నందు పని చేయుటకు మార్కెటింగ్ అనుభవంగల యువతీ యువకులు కావలెను. జీతం: 35K+TA, అర్హత: గ్రాడ్యుయేషన్, ఏరియా: కరీంనగర్ మరియు పరిసర ప్రాంతాలవారు సంప్ర: 7731069689.
NT-332611

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

విద్యార్థుల శ్రమదానం

సైదాపూర్, ఆగస్టు 5: మండల కేంద్రంలోని సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులు సోమవారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ప్రిన్సిపాల్ మహేందర్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాడికల్‌లో ఫీవర్ సర్వే

శంకరపట్నం, ఆగస్టు 5: తాడికల్ గ్రామంలో సోమవారం వైద్యాధికారి గొట్టె అర్జున్ ఆధ్వర్యంలో జ్వర సర్వే నిర్వహించారు. ఐదుగురు జ్వరాలతో బాధపడుతున్నట్లు సర్వేలో తేలిందని వైద్యాధికారి తెలిపారు. ఈ సందర్భంగా కేశవపట్నం పీహెచ్‌సీకి నాలుగు జ్వరం కేసులు వచ్చినట్లు చెప్పారు. డ్రై డేలో భాగంగా గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఎంపీవో ప